అస్మదీయులకే రుణాలు

కూటమి నేతలు, ప్రజా ప్రతినిధులు అన్ని రంగాల్లోనూ తమ వారిని లబ్ధి చేకూర్చాలని ప్రయత్నిస్తున్నారు. నిరుద్యోగులకు స్వయం ఉపాధి కల్పించేందుకు ఉద్దేశించిన బీసీ కార్పొరేషన్ రుణాలను కూడా తమ అనుయాయులకు ఇప్పించాలని చూస్తున్నారు. ఇందులో భాగంగా తాము చెప్పిన వారినే ఎంపిక చేయాలని అధికారులపై ఒత్తిడి చేస్తున్నారు. ఫలితంగా అర్హులు పథకాలకు దూరమవుతున్నారు.

- అధికారులపై కూటమి నేతల ఒత్తిడి
- అర్హులకు అందని ఆదరణ
- పేరుకే స్వయం ఉపాధికి ఊతం



గూడూరు మున్సిపాలిటీలో దరఖాస్తులను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

చిల్లకూరు : నిరుద్యోగులు స్వయం ఉపాధి పొందేందుకు ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు ఇవ్వాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా మండలానికి కొన్ని యూనిట్లను మంజూరు చేసింది. అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని పెద్ద ఎత్తున ప్రచారం చేసింది. ఇంతవరకు బాగానే ఉంది. రుణాలు ఇవ్వడంలో అర్హత ఉన్న పేదలను పక్కన పెట్టి తమ పార్టీ కార్యకర్తలు, గ్రామస్థాయి నాయకులను ఎంపిక చేసి రుణాలు ఇచ్చి ఆదుకునేలా చర్యలు


చిట్టమూరులో బ్యాంకు అధికారులతో రుణాలపై సమీక్షిస్తున్న ఎంపీడీవో

చేపడుతోంది. ఇందులో భాగంగా దరఖాస్తుల పరిశీలన సమయంలో కూటమి నాయకులు మండల పరిషత్ అధికారులకు ఫోన్లు చేసి దరఖాస్తు చేసిన వారిలో తమ పార్టీకి చెందిన వారికే రుణాలు మంజూరయ్యేలా చూడాలని ఒత్తిడి చేస్తున్నారు. దీంతో బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు తీసుకుని ఉపాధి పొందాలనుకునే వారికి నిరాశే మిగులుతోంది.

రూ.75 వేల నుంచి రూ.5 లక్షల వరకు రుణాలు

బీసీ కార్పొరేషన్ ద్వారా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని వివిధ బ్యాంకుల నుంచి బీసీలకు రుణాలు ఇవ్వాలని నిర్ణయించారు. ఈ క్రమంలో అభ్యర్థుల సామర్థ్యాన్ని బట్టి రూ.75 వేల నుంచి రూ.5 లక్షల వరకు యూనిట్లు పెట్టుకునేలా రుణాలు మంజూరు చేస్తారు. వీటిని తమకు అనుకూలంగా ఉన్న వారికే ఇప్పించేందుకు కూటమి నాయకులు అధికారులపై ఒత్తిడి తీసుకువస్తున్నారు.

మండలం	యూనిట్లు	దరఖాస్తులు
గూడూరు మున్సిపాలిటీ	33	588
గూడూరు రూరల్	57	682
చిల్లకూరు	62	365
కోట	28	372
వాకాడు	44	422
చిట్టమూరు	23	226

247 యూనిట్లకు లబ్ధిదారుల ఎంపిక

గూడూరు నియోజకవర్గంలోని మున్సిపాలిటీలు, మండలాలకు 247 యూనిట్లు మంజూరయ్యాయి. వీటిని బీసీలు, కాపులు, ఈడబ్ల్యూఎస్ కింద ఈబీసీ, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, క్షత్రియ కేటగిరీలకు విభజించారు. దరఖాస్తులు మాత్రం 2,655 వచ్చాయి. వీటిలో అర్హతను బట్టి కాకుండా కూటమి నేతలు, ప్రజా ప్రతినిధుల సిఫార్సు ఉంటేనే లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఆదేశాలు జారీ చేసినట్టు సమాచారం. తద్వారా నిజమైన అర్హులు లబ్ధిపొందే అవకాశం లేకుండా పోతుందని పలువురు చెబుతున్నారు.

అర్హతను ప్రామాణికంగా తీసుకోవాలి


వెనుకబడిన తరగతుల వారికి ఉపాధి కల్పించాలన్న ఉద్దేశంతోనే ప్రభుత్వాలు కార్పొరేషన్ల ద్వారా రాయితీ రుణాలు మంజూరు చేస్తున్నాయి. లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలి. అధికార పార్టీ నాయకుల సిఫార్సు కాకుండా అర్హతను బట్టి బ్యాంకు అధికారులు రుణాలు మంజూరు చేయాలి.

– ఎల్వీ సుబ్బయ్య, బీసీ సమన్వయ కమిటీ గూడూరు నియోజకవర్గ కన్వీనర్

సిఫార్సులు లేకుండా చూడాలి


బీసీ కార్పొరేషన్ రాయితీ రుణాల విషయంలో సిఫార్సులు లేకుండా చూడాలి. అర్హత ఉన్న వారికి మాత్రమే రుణాలు ఇవ్వాలి. తద్వారా వారు యూనిట్లు పెట్టుకుని స్వయం ఉపాధి పొందుతారు. అలాకాకుండా కూటమి నేతలు తమ వారికే రుణాలు ఇప్పించాలని చూడడం తగదు.

– సీహెచ్ ప్రభాకర్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు


క్లుప్తంగా

నిబంధనలు పాటించాలి


ప్రైవేట్ పాఠశాల వాహనాలను పరిశీలిస్తున్న సీఐ హుస్సేన్‌బాషా

కోట : కోట, విద్యానగర్‌లోని పలు ప్రైవేట్ పాఠశాలలకు సంబంధించిన వాహనాలను శనివారం వాకాడు సీఐ హుస్సేన్‌బాషా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులను తరలించే వాహనాలు పూర్తి కండీషన్‌లో ఉంచాలని, వాహన డ్రైవర్లు నిబంధనలు పాటించాలని సూచించారు. వాహన డ్రైవర్ల లైసెన్సులను పరిశీలించారు. నిబంధనలు పాటించకుంటే జరిమానా విధిస్తామన్నారు.

పేదలకు మెరుగైన వైద్యసేవలు


గర్భిణులతో మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాసులు

చిట్టమూరు : మండలంలోని పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని టాస్క్‌ఫోర్స్ జిల్లా అధికారి డాక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. ఆయన శనివారం ఆరూరు ఆరోగ్య ఉపకేంద్రాన్ని తనిఖీ చేశారు. గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. రికార్డులను పరిశీలించారు. గ్రామంలో వైద్య సిబ్బంది చేస్తున్న ఎన్‌సీడీ సర్వేను తనిఖీ చేశారు. కార్యక్రమంలో డీపీఎంవో వైద్యుడు శ్రీనివాసరావు, నాగేంద్రకుమార్, చిట్టమూరు వైద్యాధికారిణి పద్మావతి, డీపీవో ప్రకాష్, సీహెచ్‌వో బాబురావు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నేతలు

సైదాపురం: విజయవాడలో ఆదివారం రెండు విప్లవ పార్టీల విలీన సభ నిర్వహిస్తున్నట్టు పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సునీల్ తెలిపారు. ఆయన శనివారం కలిచేడు గ్రామంలో పోస్టర్లు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు దేశ సంపదను కట్టబెడుతూ ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తోందని ఆరోపించారు. ప్రజా ఉద్యమాలను అణచివేస్తోందని, ఈ తరుణంలో రెండు విప్లవ సంస్థలు ఒకే పార్టీగా ఏర్పడడం ఉద్యమానికి దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో పవన్, వంశీకృష్ణ, రమణయ్య, చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సుదర్శన మహాయజ్ఞం


పూర్ణాహుతి చేస్తున్న వేద పండితులు

సూళ్లూరుపేట : పట్టణంలోని బాలాంజనేయ స్వామి ఆలయంలో శనివారం సుదర్శన మహా యజ్ఞాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ప్రధానార్చకులు దివి లక్ష్మీ నారాయణ ఆధ్వర్యంలో వేద పండితులు యజ్ఞం చేసి పూర్ణాహుతి సమర్పించారు.

కామ్రేడ్ రాగయ్యకు ఘన నివాళి


నివాళులర్పిస్తున్న నేతలు

సైదాపురం: తుమ్మలతలుపూరు గ్రామంలోని కనకదుర్గపురం, చావలిప్పకాలనీలో శనివారం కామ్రేడ్ పంతగిరి రాగయ్య 11వ వర్ధంతిని జరుపుకున్నారు. ఆయన స్తూపం వద్ద ఘనంగా నివాళులర్పించారు. రైతు కూలీ సంఘం జిల్లా కన్వీనర్ డీపీ పోలయ్య మాట్లాడుతూ యానాది కులంలో పుట్టి, కమ్యూనిస్ట్ భావజాలానికి ఆకర్షితుడైన రాగయ్య అనేక పోరాటాలు చేసి పేదలకు ప్రభుత్వ భూములు పంచిపెట్టారని తెలిపారు. కార్యక్రమంలో కోటయ్య, వేణయ్య, యశోదమ్మ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా ఊంజల్ సేవ


స్వామి, అమ్మవార్లను తీసుకువస్తున్న అర్చకులు

రాపూరు: పెంచలకోన పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి అమ్మవార్లకు శనివారం సాయంత్రం ఊంజల్ సేవను శాస్త్రోక్తంగా చేపట్టారు. ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం ఉత్సవ మూర్తులను అలంకార మండపంలోకి వేంచేపు చేసి తిరుచ్చిపై కొలువుదీర్చారు. విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం సహస్ర దీపాలంకరణ మండపంలో ఊంజల్ సేవను నేత్రపర్వంగా నిర్వహించారు.

గ్రామసభ తీర్మానాలతోనే అభివృద్ధి పనులు


మాట్లాడుతున్న ఎంపీపీ అనీల్‌కుమార్‌రెడ్డి

సూళ్లూరుపేట రూరల్ : గ్రామసభ తీర్మానాల ప్రకారమే అభివృద్ధి పనులు చేయాలని ఎంపీపీ అల్లూరు అనీల్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. సూళ్లూరుపేట ఎంపీడీవో కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కోటపోలూరు సర్పంచ్ కమతం అరుణ మాట్లాడుతూ సర్పంచులకు తెలియకుండానే పంచాయతీ కార్యదర్శులు పనులు చేయిస్తున్నారని వాపోయారు. సర్పంచ్ అనుమతి, గ్రామసభ తీర్మానం లేకుండానే సీసీ రోడ్లు వేశారని తెలిపారు. దీనిపై ఎంపీపీ పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్‌ను నిలదీశారు. పంచాయతీ కార్యదర్శులు సర్పంచులను కలుపుకుని పనులు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. వేసవిలో తాగునీటి సమస్య రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఎన్ఆర్‌జీఎస్, జలజీవన్ మిషన్ తదితర అంశాలపై చర్చించారు.

విశిష్ట సంఖ్యతో రైతులకు ప్రయోజనాలు

కోట: రైతులు విశిష్ట గుర్తింపు సంఖ్య కలిగి ఉండడం వల్ల ప్రయోజనాలు కలుగుతాయని ఏవో నిరంజన్ కుమార్ తెలిపారు. ఆయన శనివారం కేసవరం, చిట్టేడు రైతు సేవా కేంద్రాల్లో విశిష్ట సంఖ్య నమోదు కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం నుంచి రాయితీలు, పథకాలు అందాలంటే విశిష్ట గుర్తింపు సంఖ్య ఉండాలని సూచించారు. మండలంలో 2,500 మంది రైతుల పేర్లు నమోదు చేసినట్టు తెలిపారు.

పక్కా గృహాలకు దరఖాస్తు చేసుకోండి

దొరవారిసత్రం : పక్కాగృహాల కోసం అర్హత ఉన్న వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తెలిపారు. ఆమె శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సూళ్లూరుపేట నియోజకవర్గంలోని అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ సూళ్లూరుపేట నియోజకవర్గానికి ప్రభుత్వం 10 వేల పక్కాగృహాలు మంజూరు చేయనుందని తెలిపారు. ఇప్పటి వరకు 6 వేలు దరఖాస్తులు అందాయన్నారు. అర్హత ఉన్న వారు దరఖాస్తు చేసుకునేలా సచివాలయం సిబ్బంది కృషి చేయాలన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోలు, తహసీల్దార్లను ఆదేశించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ గోపాల్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాసులునాయుడు, విజయ్‌కుమార్‌నాయుడు, మురళీరెడ్డి, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ

క్వారీని అడ్డుకుంటే చర్యలు తప్పవు


మాట్లాడుతున్న డీఎస్పీ చెంచుబాబు

ఓజిలి: మండలంలోని ఆర్మేనిపాడు సమీపంలో క్వారీ నిర్వహణకు అన్ని అనుమతులు ఉన్నాయని, వారిని అడ్డుకుంటే చర్యలు తప్పవని నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు తెలిపారు. ఆయన శనివారం ఆర్మేనిపాడు సచివాలయం వద్ద గ్రామస్తులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ క్వారీ యజమానులకు అన్ని అనుమతులు ఉన్నాయని, గ్రామస్తులు గ్రావెల్ తరలిస్తున్న వాహనాలను అడ్డుకోవడం, బోర్లను ధ్వంసం చేయడం వంటి పనులు చేయవద్దని సూచించారు. సమస్యను జిల్లా కలెక్టర్, కోర్టులు ద్వారా పరిష్కరించుకోవాలన్నారు. అంతేగాని శాంతిభద్రతలకు విఘాతం కలిగించడం మంచి కాదన్నారు. గ్రామస్తులు మాట్లాడుతూ క్వారీ సమస్యను ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్, ఆర్డీవో తదితరులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో సీఐ సంగమేశ్వర్‌రావు, ఎస్ఐ స్వప్న తదితరులు పాల్గొన్నారు.

రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరి

వాకాడు : రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరని, ప్రతి ఒక్కరూ పేర్లు నమోదు చేసుకోవాలని ఏవో దీప తెలిపారు. ఆమె శనివారం వాకాడు సచివాలయంలో రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్యతో కూడిన డిజిటల్ గుర్తింపు కార్డుపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ గుర్తింపు సంఖ్య ఉంటేనే రైతులకు ప్రభుత్వ పథకాలు, రాయితీలు వర్తిస్తాయన్నారు. సహాయకులు రాజశేఖర్, మహేష్, వీఆర్వో శ్రీనివాసులు, రైతులు పాల్గొన్నారు.


రైతుల వివరాలు నమోదు చేస్తున్న అధికారులు

సీసీ రోడ్ల పరిశీలన

చిల్లకూరు : పల్లె పండుగలో భాగంగా చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యత లేకుంటే చర్యలు తప్పవని ఉపాధి హామీ జిల్లా పీడీ శ్రీనివాస ప్రసాద్ హెచ్చరించారు. ఆయన శనివారం బూదనంలో సీసీ రోడ్ల నిర్మాణాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు అనువుగా ఉండేలా రోడ్డు వేయాలని పీఆర్ ఏఈ ఇలియాజ్‌ను ఆదేశించారు. నాణ్యతను పరిశీలించిన తర్వాతే బిల్లులు ఇవ్వాలన్నారు. గోకులం షెడ్లు కూడా మరోసారి మంజూరు చేస్తామని తెలిపారు. ఉపాధి ఏపీవో గిరిబాబు, మైలాం శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

కలువాయి ఎంపీడీవోగా భవాని


కలువాయి: కలువాయి ఎంపీడీవోగా ఎం.భవాని (ఎఫ్ఏసీ) శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎఫ్ఏసీ ఎంపీడీవోగా పనిచేస్తున్న పొదలకూరు ఎంపీడీవో నరసింహారావు అనారోగ్య కారణాలతో శెలవుపై వెళ్లారు. ఈ క్రమంలో రాపూరు ఎంపీడీవో భవానికి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

బస్సులు కండిషన్‌లో ఉండాలి

గూడూరు రూరల్ : ప్రయివేటు స్కూళ్ల యాజమాన్యాలు కండిషన్ ఉన్న బస్సులు నడపాలని గూడూరు డీఎస్పీ గీతాకుమారి ఆదేశించారు. తడ మండలంలో శుక్రవారం నారాయణ స్కూల్ బస్సు బోల్తా పడిన నేపథ్యంలో ఆమె శనివారం ఎంవీఐ ప్రభాకర్‌రావుతో కలిసి గూడూరులోని ప్రయివేటు స్కూళ్ల బస్సులు తనిఖీ చేశారు.



బస్సులను తనిఖీ చేస్తున్న డీఎస్పీ గీతాకుమారి

చేపల చెరువు వేలం

పెళ్లకూరు: మండలంలోని పునబాక చెరువులో చేపలు పట్టుకోవడానికి శనివారం గ్రామ సచివాలయం వద్ద వేలం పాటలు నిర్వహించారు. గ్రామానికి చెందిన తాళ్ల యుగంధర్ రూ.83 వేలకు చెరువును దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ విజయలక్ష్మి, కార్యదర్శి మధుమోహన్, గ్రామస్తులు లింగమనాయుడు, బెన్ని, లోకేష్, గాంధీ, కృష్ణయ్య, చంద్ర, చలపతి తదితరులు పాల్గొన్నారు.

కండలేరులో 52.521 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శనివారం నాటికి 52.521 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్టు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 640, లోలెవల్ కాలువకు 210, హైలెవల్ కాలువకు 190, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్టు తెలిపారు.

మత్స్యకారుల పిల్లలకు ప్రోత్సాహకాలు

చిల్లకూరు : తీర ప్రాంతంలోని మత్స్యకారుల పిల్లలను అన్ని రంగాల్లోనూ ప్రోత్సహిస్తామని అదానీ క్రిష్ణపట్నం పోర్టు ప్రతినిధులు తెలిపారు. వారు శనివారం గమ్మళ్లదిబ్బ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. పోర్టు భద్రతా విభాగం హెడ్ కౌన్సిల్ సింగ్, ఫైనాన్స్ హెడ్ గుడివాడ శ్రీకాంత్ బహుమతులు అందజేశారు. వారు మాట్లాడుతూ పిల్లల్లోని ప్రతిభను వెలికి తీసేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పోర్టు సీఈవో జగదీష్ పటేల్, మృత్యుంజయరామ్ తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట పట్టనం అగ్రహారపేటలో ఇంట్లో నగదు, నగలు చోరీకి గురైనట్టు బాధితులు శనివారం గుర్తించారు. వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అగ్రహారపేటలో ఉంటున్న మాధవి రెండు రోజుల క్రితం ఊరికి వెళుతూ పక్కనే ఉన్న వారి తాళం ఇప్పించుకుని ఇంటికి తాళం వేసింది. తాళం చెవులు తీసుకుని వెళ్లింది. శుక్రవారం తిరిగి ఇంటికి వచ్చింది. శనివారం నగదు అవసరమై బీరువాలో చూడగా రూ.5 వేలు కనిపించలేదు. ఇంటి ఆటకపై దాచి ఉన్న నాలుగు సవర్ల బంగారు నగలు కూడా లేవు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు అనుమానితులను తీసుకొచ్చి విచారిస్తున్నారు.

బెల్టు షాపులపై దాడులు

వాకాడు : మండలంలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్టు షాపులపై శనివారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. కొండాపురం వడ్డిపాళెంలో యనమల గురవయ్యను అదుపులోకి తీసుకుని 10 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసినట్టు సీఐ ఆర్‌యూవీఎస్ ప్రసాద్ తెలిపారు. ఈ దాడుల్లో ఈఎస్‌టీఎఫ్ టీమ్ అధికారులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

చిల్లకూరు : పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని గూడూరు డీఎస్పీ గీతాకుమారి పిలుపునిచ్చారు. మండలంలోని తిక్కవరం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం పీపుల్స్ వెల్ఫేర్ అండ్ చైల్డ్ ఎడ్యుకేషనల్ ట్రస్టు ప్రతినిధులు పరీక్ష సామగ్రి అందజేశారు. ఆమె మాట్లాడుతూ ట్రస్టు నిర్వాహకులు పోతుగుంట మల్లికార్జున్ చిరు ఉద్యోగి అయినా విద్యార్థులకు చేయూత ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం సునీల్‌కుమార్, ట్రస్టు సభ్యులు అరుణ్‌కుమార్, ఏసుదాస్, బెల్లంకొండ గురవయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే పారిచెర్లవారిపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రెడ్డి సంక్షేమ సంఘం ప్రతినిధులు పరీక్ష సామగ్రి అందజేశారు. సంఘం మండల అధ్యక్షులు సనత్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు దేశ స్వాతంత్ర్య పోరాట యోధులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రజేంద్రరెడ్డి, హరినాథరెడ్డి, ధనుంజయరెడ్డి, సిద్దారెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, క్రిష్ణారెడ్డి, వెంకటశేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా వల్లిపేడులోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గూడూరుకు చెందిన బాస్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు కూరపాటి రవీంద్రబాబు పలు కార్యక్రమాలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం మధుకర్, ఉపాధ్యాయులు అమర్‌నాథ్, శేషయ్య, విద్యా కమిటీ చైర్మన బండి మురళీక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.


తిక్కవరం జెడ్పీ హైస్కూల్‌లో పరీక్ష సామగ్రి అందజేస్తున్న గూడూరు డీఎస్పీ గీతాకుమారి

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి


కోట : పరిసరాల శుభ్రతపై కరపత్రాలు పంపిణీ చేస్తున్న డీఎల్‌పీవో వెంకటరమణ


ఓజిలి: తడి, పొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్న డీఎల్‌పీవో రవీంద్రబాబు

చిట్టమూరు/కోట/ఓజిలి : ప్రజలు తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని డీఎల్‌పీవోలు పి.వెంకటరమణ, రవీంద్రబాబు తెలిపారు. వెంకటరమణ శనివారం చిట్టమూరు మండలం ఎల్లసిరి గ్రామం, కోట మండలం విద్యానగర్‌లోను, రవీంద్రబాబు ఓజిలి మండలం చిలమానుచేను పంచాయతీలో పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ తడి, పొడి చెత్తను వేర్వేరుగా పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలన్నారు. గ్రామంలో ఎక్కడ పడితే అక్కడ పేడ దిబ్బలు వేయరాదన్నారు. రోడ్లపై చెత్త వేయరాదని దుకాణదారులకు సూచించారు. చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకువచ్చి వర్మీకంపోస్టు తయారు చేయాలన్నారు. చిట్టమూరు ఎంపీడీవో మనోహర్ గౌడ్, డీఆర్పీ రవి, ఓజిలి మండలం చిలమానుచేను సర్పంచ్ పారిచర్ల సాయిరాం, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్

సూళ్లూరుపేట రూరల్ : సూళ్లూరుపేట మండలంలోని ఆబాక పంచాయతీలో శనివారం పారిశుద్ధ్యంపై ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి సుమతి ఆధ్వర్యంలో సిబ్బంది గ్రామాల్లో మురుగు కాలువలను శుభ్రం చేశారు. పేడ దిబ్బలు తొలగించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలకు తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు

గూడూరు రూరల్ : విద్యతోనే ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చని ప్రముఖ సినీ నటి గీతాసింగ్ తెలిపారు. గూడూరులోని వివేకానంద ఇంగ్లీషు మీడియం పాఠశాల వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చిన్న తనం నుంచి క్రమశిక్షణ అలవరుచుకుని పట్టుదలతో చదివితే భవిష్యత్తు బాగుంటుందన్నారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే పలు పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ చంద్రమోహన్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. అలాగే గూడూరు రెండో పట్టణంలోని వీఎస్సార్ పాఠశాల వార్షిక క్రీడా పోటీలు చేపట్టారు. పాఠశాల డైరెక్టర్ బాలక్రిష్ణంరాజు మాట్లాడుతూ తమ పాఠశాలలో ఉత్తమ విలువలతో విద్య అందిస్తున్నామని తెలిపారు. అనంతరం పోటీలు నిర్వహించి విజేతలకు రోటరీ క్లబ్ పాస్ట్ గవర్నర్ కొణిదల మునిగిరీష్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ అన్నపూర్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సినీ నటి గీతాసింగ్ నుంచి బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

ఇంద్రజాలంతో ప్రజల్లో చైతన్యం

అంతరిక్ష యానం చేస్తున్న ఈ కాలంలోనూ గ్రామాల్లో మూఢ నమ్మకాలు ఎక్కువగా ఉన్నాయి. కొంతమంది అమాయకులను మోసం చేస్తూనే ఉ న్నారు. ఇంద్రజాలంతో మూఢ నమ్మకాలపై ప్రజలను చైతన్యవంతులను చేయడానికి తన వంతు కృషి చేస్తున్నారు సూళ్లూరుపేటకు చెందిన ఎంఎస్‌రెడ్డి.

- మూఢ నమ్మకాలపై ప్రజలను చైతన్యవంతులను చేస్తున్న వైనం
- సూళ్లూరుపేట మాయలోడు ఎంఎస్ రెడ్డి
- నేడు ప్రపంచ ఇంద్రజాల దినోత్సవం


దివంగత సీఎం వైఎస్ఆర్ నుంచి అవార్డు అందుకుంటున్న ఎంఎస్ రెడ్డి (ఫైల్)


వైఎస్ జగన్ నుంచి ప్రశంసలు అందుకుంటున్న ఎంఎస్‌రెడ్డి (ఫైల్)

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట పట్టణంలో అయిదారుగురు ఇంద్రజాలికులు ఉన్నారు. వారిలో మండెం సుబ్రమణ్యంరెడ్డి అలియాస్ ఎంఎస్‌రెడ్డి ఒకరు. చిన్న వ్యాపారం చేసుకుంటూ జీవించేవారు. ఇంద్రజాలంపై వున్న మక్కువతో డాక్టర్ బీవీ పట్టాభిరామ్‌ను గురువుగా భావించి ఇంద్రజాలం చేయడం నేర్చుకున్నారు. మాట్లాడే బొమ్మతో పలు వేదికల మీద ప్రదర్శనలు ఇస్తున్నారు. మన రాష్ట్రంలోని అనంతపురం, తిరుపతి, నెల్లూరు, గూడూరు, విజయవాడ, హైదరాబాద్, కర్ణాటకలోని దావణగేరె, గుల్బర్గా తదితర ప్రాంతాల్లో అనేక ప్రదర్శనలు ఇచ్చారు. ఇందులో జంతర్ మంతర్–2001 ప్రదర్శనలో క్రియేటివ్ మెజీషియన్‌గా గుర్తింపు పొందారు. ఆయా ప్రాంతాల విశిష్టతలకు అనుగుణంగా బొమ్మలు వేసి చూపించడం, కడుపులోకి పెద్ద కత్తి పోనిచ్చి బయటకు తీయడం లాంటి ప్రదర్శనలు ఈయన ప్రత్యేకత. ఇంద్రజాల ప్రదర్శనల్లో మేటి అయిన నేరెళ్ల వేణుమాధవ్, బీవీ పట్టాభిరామ్, సీవీ రమణ, షాడో, క్రాంతికుమార్ వారి మన్ననలు కూడా అందుకున్నారు. పలు అవార్డులను సైతం పొందారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఆయన కుమారుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రశంసలు అందుకున్నారు. సినీ నటులు అక్కినేని నాగేశ్వరరావు, మెగాస్టార్ చిరంజీవి, బీవీ పట్టాభిరామ్ చేతులు మీదుగా అవార్డులు అందుకున్నారు.